
# అవాక్కయ్యారా?

**- ఎమ్.వి.వి.సత్యనారాయణ**



వాళ్ల ఇద్దరి పెళ్లిళ్లకూ... అవును పెళ్ళిళ్ళే! అంతకు ముందు ప్రియకు రెండు పెళ్ళిళ్ళు జరిగాయి. గోపాల్‌కు మూడు పెళ్ళిళ్ళయ్యాయి. జరిగిన అన్ని పెళ్ళిళ్ళకూ ఆకాశ మంత పందిళ్ళూ, భూదేవంత అరుగులూ వేయడం జరి గింది. పాత పార్ట్‌నర్స్‌కి విడాకులిచ్చి ఒకటిరెండు 'అఫైర్లు' జరిగాయి. ఆ అఫైర్ల క్రమంలోనే వాళ్లిద్దరూ తమ అఫైర్‌ని వివాహబంధంగా మార్చుకోవాలనుకున్నారు.

అంతే! పత్రికా విలేకర్లూ, టి.వి. ఛానెల్స్ వాళ్ల యిద్దరి భవనాల చుట్టూ, వ్యవహారాల చుట్టూ పరిభ్రమించడం మొదలయ్యింది. వధూవరుల ఇంటర్వ్యూ లభించడం కష్ట మైపోయింది.

చివరికి ప్రియ ఒక షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవా నికి విచ్చేసింది. ఆ సందర్భంగా మీడియా కంటబడిపో యింది. ఆరు గంటలపాటు అటు అమీర్‌పేట ఇటు ప్యాట్నీ సెంటర్ల మధ్యలో ట్రాఫిక్‌జాం ఏర్పడి ప్రజలు నరకం చవిచూశారు.

ప్రియను చూసిన లక్షలాది మంది జనం తమ చూపులు తిప్పుకోలేకపోయారు. ముప్పాతిక మూడొంతులు టాప్ లెస్ గౌనూ, మిడ్డీ సైతం ఎక్కడపడితే అక్కడ కిటికీలు పెట్టుకుని మోకాళ్ల పై భాగం ముప్పాతిక భాగం కనిపి స్తూనూ బహుముచ్చటగా దిగబడింది.

"ముసల్ది ఇంకా బింకంగానే ఉందిరా!" లొట్టలు వేశాడు డ్యూటీ కానిస్టేబులు.

"ఆ సంగతి రుజువు చెయ్యడానికే కదూ, ఇలా ప్రత్యక్ష మయ్యింది..." అంటూ మోటుమాటలు రెండోమూడో వది లాడు ప్రక్క కానిస్టేబులు.

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం సంగతేమో కాని పదిహేను ఇరవై సెగ్మెంటుల్లో లాఠీఛార్జ్ జరిగింది. గుంపుల మీద వీరంగం చేస్తూ పోలీసు కానిస్టేబుళ్ల తమ చేతి తీటా, జబ్బ సత్తువా ప్రదర్శించుకున్నారు. అరడజను తల కాయలూ, నాలుగైదు కెమెరాలూ పగిలాయి.

ప్రారంభోత్సవానికి ముందు రెండు నిమిషాలపాటు మీడియా వారికి ఫొటోలు తీసుకునే సదవకాశం కల్పిం చింది ప్రియ.

"మీ పెళ్లి గురించి వివరాలు చెబుతారా?" అడిగాడు ఒక పత్రికా విలేకరి.

తన ఎద మరింత స్పష్టంగా కనిపించేటట్టు ఆమె ముందుకు వంగి, చిరునవ్వుల్ని చూపులుగా సంధించి వదులుతూ వేళ్లతో పాయలపాయల జుత్తును గీరు కుంటూ, "గోపాల్ నా ప్రాణం. వచ్చేనెల ఆరో తారీకున మేమిద్దరం ఒక ఇంటివారమవుతాం!" అంది ప్రియ.

"గోపాల్‌లో మీకు నచ్చిన అంశం చెబుతారా?" మరో విలేకరి తన బాణం సంధించాడు.

"ఆయనకి నేను ప్రాణం!" కన్ను గీటింది ప్రియ.

"ఈ పెళ్లి మీ జీవితంలో చివరి పెళ్లిగా భావించవ చ్చునా!"

"తప్పకుండా! అయినా సెలబ్రిటీలు మళ్లీ పెళ్లిచేసుకుంటే మీకేం హడావుడి!"

"ఇంతకుముందు మీ రెండు పెళ్లిళ్లూ ఎందువల్ల విఫలమయ్యాయి?"

"కాలం మారుతోంది కదా! మనం మార వద్దా, నాకు మాత్రం అభిరుచులు మారవా! అయినా మీకేమిటింత ఇంట రెస్ట్?"

"అర్థం కాలేదు, కాస్త వివరిస్తారా!"

షాపింగ్ కాంప్లెక్స్ యజమాని కలగచేసు కున్నాడు, "మాడం! ప్లీజ్!"

ప్రియ తన మొహం లోని రిలీఫ్‌ని దాచు కుంటూ, మీడియాకు టాటా చెప్పి కార్యక్రమా నికి సన్నద్ధమయ్యింది.

అరగంట తర్వాత ప్రఖ్యాత ఐటంబాంబ్ ప్రియను బయటికి పంపించడానికి కార్యక్రమ నిర్వాహ కులు పడిన హైరానా అంతా ఇంతా కాదు అక్కడికీ దొడ్డి దారి ఏర్పాటుచేసుకున్నారు కూడా.

ఆ రాత్రి గోపాల్‌తోపాటు ఒకే రొజాయి క్రిందకు ఆమె చేరినప్పుడు.

"ఎలా జరిగింది ప్రారంభోత్సవ కార్యక్రమం?" అడి గాడు గోపాల్.

"న్యూస్ ఛానెల్‌లో చూడలేదా!" అంది ప్రియ.

"లేదు!... తల తిప్పాడు గోపాల్."

"ఎలా ఉన్నాను?"

"అప్పలమ్మ లాగా!"

"ఛ... ఇంకా ఎలా ఉండాలి?"

"ఇంకానా! అప్పటికే గోల గోల... మీడియా విమర్శిం చింది!"

ఆమెను బలంగా పెదిమల మీద ముద్దుపెట్టుకుని, "ప్రపంచంలో ఉన్న ప్రతి ఒక్కడూ అసూయతో కుళ్లికుళ్లి చావాలి." అన్నాడు గోపాల్.

ప్రియ కిలకిల నవ్వింది.

"ఎందుకని అడగవేం! ఇంతటి అందాలరాశి నా సొంతమైనందుకు! నిజం చెప్పనా! నీ కౌగిట్లో నేను ప్రపంచాన్నే మర్చిపోతున్నాను తెలుసా?"

"గోపాల్! నా అందచందాలు ప్రజలందరికీ చూపి స్తోంటే నీకు అసూయగా ఉండదూ?"

గోపాల్ పరాకుగా వింటున్నాడు.

"నేను నీకు అంటి పెట్టుకుని ఉండగానే మరో ఆడదాని గురించి ఆలోచనా!" అతడి ఛాతీమీద వెంట్రుకలు కసిగా లాగింది ప్రియ.

చురుకుగా కదిలాడు గోపాల్. ఆమెను పొదివి పట్టు కునే, "ప్రారంభోత్సవం నుండి తిరిగి వస్తూ ఎవరిని కలు సుకున్నావు?" అన్నాడు.

"లక్షలాది మంది నా అభిమానులను!"

"అంతేకాదు... మధ్యలో మరొకరిని కలుసుకున్నావు!"

"ఎవరిని?"

"నువ్వే చెప్పు!"

ప్రియకు మెదడులో బల్బు వెలిగింది.

"ఎవరు వెంటాడారు నన్ను?" అంది ప్రియ.

"ఎవరో కాదు... నేనే!"

"ఇంకేం! ఎవరిని కలుసుకున్నానో నీకు తెలుసుకదా!"

"అదే, నీ మొదటి భర్తను ఎందుకు కలుసుకోవాలనిపిం చింది?" ఆమె మాట్లాడలేదు.

"పాత ప్రణయం గుర్తొచ్చిందా!"

"ఛీ. ఛీ... మనం ప్రపోజల్ పెట్టుకున్నాకనా... ఎంత నీచంగా ఊహించావు!"

"నీచమా?"

"కాదా! నిజాయితీ ఉండొద్దా?"

"నిజం చెప్పు... మనం ఇద్దరం నిజాయితీపరుల మేనా?"

ప్రియ మాట్లాడలేదు.

"ఎందుకులిశావు? నిజం చెప్పు!"

"పెద్దగా కారణం లేదు. ఆమధ్యన ఎప్పుడో ఫోన్ చేశాడు. కారు అటే వెళ్తోంటే ఒక పనయ్యి పోతుందని కలిశాను!" మాట తిరగేసింది ప్రియ.

"ఏం మాట్లాడుకున్నారు?"

"కొంపతీసి ఆ మాటలు కూడా విన్నావా?"

"ప్చ్... మీరిద్దరూ బెడ్‌రూంలో ఉన్నారు. మాటలు వినపడటం లేదు. రవితో ఏం మాట్లాడావు?"

ప్రియ అతడ్ని అసహ్యంగా చూసింది.

"నువ్వేం అలా చూడనక్కర్లేదు. ఇప్పుడు నేను నా పాత భార్యలను కలుసుకుంటే నీకెలా ఉంటుంది చెప్పు..."

"ఏమో, నాకు తెలియకుండా కలుసుకుంటున్నావేమో!" అతడి ప్రక్కనించి లేచింది ప్రియ.

"నాకామాత్రం న్యాయం, నిజాయితీ ఉన్నాయి. లేనివల్లా నీకే!" మాట్లాడుతూనే తన మొహం ఎర్రగా చేసుకున్నాడు గోపాల్.

ప్రియ ఆలోచించుకుంటోంది. రెండు రోజులు గడిచాయి.

రెండురోజుల నుంచి గోపాల్‌కి తాను ఫోన్ కూడా చెయ్యలేదు. అతడు కూడా ఫోన్ చెయ్యలేదు. మనస్సంతా వెలితిగా ఉంది. ప్రారంభోత్సవం రోజున తనను గోపాల్ వెంటాడాడు. ఆ సంగతి తలచుకుంటూంటేనే తన మనస్సంతా కుతకుతలాడిపోతూంది.

అతడికి తన మీద అనుమానం ఎలా కలిగింది!

సెల్‌ఫోన్ మోగింది.

ప్రియ ఆత్రుతగా సెల్‌ఫోన్ అందుకుని కాల్ ఎక్కడ్నించో చూసింది. గోపాల్ కాదు. రవి!

"రవీ!" అంది ప్రియ.

"వూc! ఎక్కడున్నావు!" అడిగాడు రవి.

"ఇంట్లోనే. ఆ రోజు మనం కలుసుకోవడం పొరపాటు రవీ! కాదూ అంటే వినలేదు నువ్వు! నేనే ఫోన్ చేస్తాను!" నువ్వు చెయ్యక!"

"ఏం! గోపాల్‌కి తెలిసిందా?"

"ఆహా... నన్ను వెంటాడాడు. మనం బెడ్‌రూంలో ఉన్నట్టు కూడా నిర్ధారించుకున్నాడు."

"సరే... మరి నువ్వు గమనించుకోవద్దూ.. ఎవరైనా వెంటాడుతున్నారా అని మీడియా వాళ్లక్కూడా మనలాంటి తిరుగుబోతులంటే ఎంత ప్రేమో!"

"నాకు అది చేతకాదు! అవును... మీడియా మనని వదలదా!"

"వదలదు అయితే ఇప్పుడేం చెయ్యాలనుకుంటున్నావు?" టాపిక్ మార్చాడు రవి.

"నువ్వే చెప్పు..."

"క్షమాపణ అడుగు... తిరిగి తిరిగి అలా ఎప్పుడూ కలుసుకోనని చెప్పు. అంతే! మనం ఇక ముందైనా జాగ్రత్త పడాలి."

"మనం ఎందుకు కలుసుకోవాలనుకున్నామో చెప్పు అంటాడు."

"చెప్పు. బాంకు లావాదేవీలు ఇంకా మిగిలిపోయాయి. వాటిని పరిష్కరించుకోవడానికి కలుసుకున్నామని చెప్పు."

"నమ్ముతాడా? ఆరోజే చెప్పాల్సింది. ఇప్పుడు చెబితే అదంతా కట్టుకథ అనుకోడా?"

"అనుకుంటే మాత్రం నీకేం నష్టం!"

"సరే... ఫోన్‌లో చెప్పమంటావా? పర్సనల్‌గా చెప్పనా!" సెల్‌ఫోన్‌లో నవ్వు వినిపించింది. ఆమెకు ఆ మాటన్నాక.

ప్రియ కూడా నవ్వి, "పర్సనల్ టచ్‌లో చెప్పమంటావు... అంతేనా?" అంది.

"నీకు చెప్పాలా, మహా మేధావినివి!" అతని సెల్‌ఫోన్ కట్ అయ్యింది.

ప్రియ తేలికగా నిట్టూర్చింది. రవిలో కొంటెతనం తగ్గలేదు.

"అమ్మగారూ! అమ్మగారూ!"

ప్రియ ఆలోచనల్లోంచి తేరుకుని ఆమెను చూసింది.

"అంట్లు తోమేశానమ్మగారు! ఇల్లంతా వూడ్చాను. ఈ గది ఒక్కటే మిగిలింది" అంది పనిమనిషి.

ప్రియ తలూపి ఆ గదిలోంచి బయటికి నడిచింది.

ఆ గది వూడ్చి ఇక వెళ్లబోయేముందు సంశయిస్తూ నిలబడింది పనిమనిషి.

"చెప్పూ... సందేహమెందుకు?" అంది ప్రియ.

"నిన్న ఒకాయన వచ్చారండి. ఈమధ్యనే మీరు ఆయనకి విడాకులిచ్చారటండి! ఆయన!"

ప్రియ ఆశ్చర్యంగానూ, తడబాటుతోనూ చూసింది.

"ఏమన్నాడో?"

రెండురోజుల నుంచి గోపాల్‌కి తాను ఫోన్ కూడా చెయ్యలేదు. అతడు కూడా ఫోన్ చెయ్యలేదు. మనస్సంతా వెలితిగా ఉంది. ప్రారంభోత్సవం రోజున తనను గోపాల్ వెంటాడాడు. ఆ సంగతి తలచుకుంటూంటేనే తన మనస్సంతా కుతకుతలాడిపోతూంది. అతడికి తన మీద అనుమానం ఎలా కలిగింది!

"తనకోసారి ఫోన్ చెయ్యమన్నారండి!" అలా రాకూడదు కదండి, రానివ్వకూడదు కూడానండి! అదే మాలో అయితేనా...!"

"ఆ సమయంలో నేను ఇంట్లో లేనా! నాకు క్లాస్ పీకుతున్నావ్!"

"పై గదిలో మత్తుగా నిద్రపోతున్నారండి!"

ప్రియకు గుర్తొచ్చింది. హాఫ్ బాటిల్ విస్కీ తాగి ముందు రోజంతా మత్తుగా నిద్రపోయింది తాను. సరిగ్గా ఆ సమయంలో వచ్చి ఉంటాడు తన రెండో భర్త. అతడికిప్పుడు తనతో ఏం పని!

కొంపతీసి విడాకులు రద్దు చేసుకుందామంటాడా ఏం?

మొదటి భర్త రవి కూడా పోయిన నెలలో అదే ప్రపోజల్ పెట్టాడు. మూడో మగాడితో ప్రపోజల్ చేసుకున్న తర్వాతనా వీళ్లిద్దరికీ చావు తెలివి తేటలు పుట్టుకొచ్చాయి.

ట్రిమ్‌గా తయారైంది ప్రియ. కప్‌బోర్డ్‌లోంచి తాను భద్రపరచుకున్న సీసా ఒకటి హాండ్‌బాగ్‌లో వేసుకుంది. రెండు ఫోన్‌కాల్స్ చేసింది. వాటిలో ఒకటి గోపాల్‌కి.

"సైట్ మీదున్నాను. ఒక గంటవరకూ రాలేను." అన్నాడు గోపాల్.

ప్రియ మొహం వెలిగిపోయింది. గోపాల్ పాత పగ విషయం మరచిపోయాడు. తాను కూడా మరచిపోయినట్టే నటించింది!

కారు తీసి బయల్దేరింది.

గోపాల్ ఇంటి తాళంచెవుల డూప్లికేట్లు తనవద్ద ఉంచుకోవడం మంచిదయ్యింది.

గోపాల్ సైట్ నించి తిరిగి వచ్చేటప్పటికి బల్లమీద రెండు చిల్డ్ బీర్స్, అప్పుడే వేడి చేసిన కోడి జాయింట్లూ, నేతిలో వేయించిన జీడిపప్పూ సిద్ధంచేసి ఉంచింది ప్రియ.

"వండర్‌ఫుల్!" వస్తూనే ప్రియను ముద్దు పెట్టుకున్నాడు గోపాల్.

"మినరల్ వాటర్ ప్లీజ్!" అన్నాడు గోపాల్.

ఫ్రిజ్ తెరచింది ప్రియ. ఒకే ఒక్క మినరల్ బాటిల్ ఉంది. సీల్ తెరచి గోపాల్‌కి అందించింది.

"మొదటి సిప్ ఎప్పుడూ నీదే, మరచిపోయావా!" నవ్వాడు గోపాల్.

ప్రియ అతడి చెక్కిళ్లలో పొడిచి బాటిల్ ఎత్తి గటగట తాగి గోపాల్‌కి సీసా అందించబోయింది. అప్పటికే ప్రియకు తన చుట్టూ ఉన్న ప్రతి వస్తువూ గిరగిర తిరుగుతూ కనిపిస్తోంది. నాలుక పిడచ కట్టుకుపోవడం, గొంతును ఎవరో మెలిపెడుతున్నట్టు కావడం, గొంతు నుంచి దిగుతున్న నీటి జాడ అంతా ఒక కొలిమిలాగా మండటంతో గిజగిజలాడుతూ మొదలు నరికిన చెట్టులాగ విరుచుకు పడిపోయింది ప్రియ. ముక్కుపుటాల్లోంచి రక్తం చుక్కలు బయటపడ్డాయి.

గోపాల్ మొహంలో పైశాచికానందం తాండవించింది.

ప్రియ శరీరాన్ని చేతులు పట్టుకుని బరబర పడక గదిలోకి ఈడ్చుకుపోయాడు గోపాల్.

వెలుపలి నుంచి గోపాల్ మొదటి భార్య రంగప్రవేశం చేసింది. క్రింద పడిన మినరల్ వాటర్ బాటిల్‌ను గ్లవ్స్ అమర్చిన చేత్తో అందుకుని నేలమీది చెమ్మను టర్కిష్ టవల్‌తో సుతారంగా అద్దీ బాటిల్‌ను సింక్‌లో వేసి శుభ్రంగా కడిగి క్రష్ చేసి డస్ట్‌బిన్‌లో విసిరింది. వాషింగ్ మెషిన్‌లో పౌడర్ వేసి టవల్ నానపెట్టింది.

డూప్లికేట్ తాళంచెవుల మీదా, తలుపుల మీద వంటింట్లో, ఫ్రిజ్ తలుపు మీదా, ఇంకా వ్రేలిముద్రలు ఎక్కడెక్కడ ముద్రపడే అవకాశముందో అక్కడల్లా పొడి టవల్‌తో తుడిచి వేసింది గోపాల్ మొదటి భార్య.

"గొయ్యి సంగతేంటి?" అంది మొదటి భార్య.

"రెండు రోజులయ్యింది తవ్వించి! ఈరోజుకు ప్రియకు దాంట్లో చేరడానికి వీలు చిక్కింది!" నవ్వాడు గోపాల్.

"ఇక ఆలస్యం దేనికి?" అంది గోపాల్ మొదటి భార్య.

"కాబోయే ఇల్లాలు బాంక్ బాలన్సులూ, ఆస్తిపాస్తులూ, లాకర్స్ తాళంచెవులూ మొత్తం ఒప్పచెప్పింది కదా! లంకంత కొంప ఎటూ స్వాధీనం చేసుకుంటాం"అన్నాడు గోపాల్.

"ఈవిడ ఆస్తితోపాటూ ముగ్గురి ఆస్తులు విజయవంతంగా స్వాధీనపర్చుకున్నాం. శవాన్ని పూడ్చేస్తే ఒక పనయ్యిపోతుంది కదా!" అంది మొదటి భార్య.

"కంగారు లేదు. మనకోసం పార్టీ సిద్ధంచేసి ఉంచింది కదా ప్రియ. బీరు మీద బీరు కొట్టి ముక్కమీద ముక్క నంజి..."

ఇద్దరూ టీపాయ్‌కి ఇటూ అటూ కూర్చుండి బీరు సీసాలు తెరచి పట్టుకున్నారు. బాటిల్స్ ఢీ కొట్టారు.

సిప్ చేసి బాటిల్స్ దించారు వాళ్లిద్దరూ.

చెరో లెగ్ పీసూ అందుకున్నారు.

"మినరల్ వాటర్ బాటిల్‌లోని సైనెడ్ ఇంజెక్ట్ చేసిన నీ ప్రతిభకు జోహార్లు!" అంటూ ఆమె అతడి చేత లెగ్‌పీసు కొరికించింది. అతడి చేతిలోని లెగ్ పీస్ తాను కొరికింది.

ఇద్దరూ తాగుతున్నారు. తింటున్నారు. ఒకరిమీద ఒకరు పడి ఒకరికొకరు సపోర్టరుగా బరువాన్చి వాళ్లిద్దరూ పది నిమిషాల తర్వాత నిశ్చలంగా ఉండిపోయారు. కంటి చూపు నిలబడిపోయింది.

ప్రియ అతడ్ని ఎందుకక్కడికి రమ్మందో రవికి వివరించే వాళ్లే ఆ ఇంట్లో లేరు.

★